ప్రజాశక్తి
ఆదివారం 12 నవంబర్ 2023

అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి అర్పిస్తున్న జాయింట్ కలెక్టర్, మేయర్ తదితరులు

స్ఫూర్తినీయుడు అబుల్ కలాం ఆజాద్

జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

స్వాతంత్ర సమరయోధుడు, భారతరత్న డా॥మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలు ఎంతో స్ఫూర్తినీయం అని, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కషి చేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ పిలుపునిచ్చారు. అనంతపురం కలెక్టర్‌లోని రెవెన్యూ భవనంలో అబుల్ కలాం ఆజాద్ 136వ జన్మదిన వేడుకలను శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, నగరపాక సంస్థ మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఉమాదేవి, మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్ ఫయాజ్, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి మహమ్మద్ రఫీ, తదితరులు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో విద్యారంగం అభివద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ముస్లింల అభ్యున్నతి, దేశ ప్రజల ఐక్యతకు ఆయన ఎంతగానో కషి చేశారన్నారు. ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, కార్పొరేటర్ మొగల్ సైపుల్ల బేగ్, ఇసాక్, జిల్లా వక్ఫ్ బోర్డు ప్రెసిడెంట్ రిజ్వాన్, స్టేట్ మైనార్టీ జనరల్ సెక్రెటరీ షేక్ ఖాజా, మత పెద్దలు రఫిక్ మౌలానా, నూర్ భాషా సంఘం జిల్లా అధ్యక్షుడు నిజాం, రహీం, ముతవల్లి మహమ్మద్ రఫీ, ప్రభుత్వ ఖాజీలు పాల్గొన్నారు.

పేలుతున్న ధరలు..!

◆ కొండెక్కిన టపాసుల రేటు ◆ అమ్మకాల్లో నిబంధనలు బేఖాతర్

టపాసులకు నిప్పుపెట్టకనే ధరల మంటతో పేలుతున్నాయి. అసలు వాటి ధరలు తెలిపే సూచనలేవి లేకుండా విక్రయశాలలకు చేరాయి. బాహాటంగానే నిబంధనలు అతిక్రమించి అమ్మకాలు జోరుగా సాగడం మొదలైంది. అనంతపురం జిల్లాలో 220 టపాసుల విక్రయశాలలకు అనుమతులిచ్చారు. ఇందులో అనంతపురం నగరంలోనే 103 దుకాణాలకు అనుమతులిచ్చారు. వీటిని శ్రీనగర్ కాలనీలో ఏర్పాటు చేశారు. సత్యసాయి జిల్లాలోనూ ఇదే రకంగా ఏర్పాట్లు జరిగాయి. అక్కడ కూడా ఇదే తంతు నడిచినట్టు ఆరోపణలున్నాయి.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఏ వస్తువు అయినా అమ్మకాలు జరపాలంటే విధిగా అమ్మకపు ధర ఆ ప్యాకెట్‌పై ఉండాలి. అదే విధంగా ఎక్కడ తయారయిందన్న చిరునామా విధింగా ఉండాలి. వినియోగదారుడు ఫిర్యాదు చేయడానికి మొబైల్ నెంబరు, మెయిల్ ఐడి విధిగా ఉండాలి. ఇవేవి లేకుండానే టపాసుల విక్రయాలు సాగుతున్నాయి. సాక్షాత్తు తూనికలు, కొలతల శాఖ అధికారుల తనిఖీల్లోనే ఇవి వెల్లడయ్యాయి. ఇంత జరుగుతున్నా వాణిజ్య పన్నుల శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాల్లేవు. తూనికల శాఖ అధికారులు మాత్రం కొన్ని షాపులను పరిశీలించి రూ.15 వేలు జరిమానా విధించారు.

జీఎస్టీ లేకుండా అమ్మకాలు

ఏ వస్తువులు అమ్మాలన్న విధంగా బిల్లు ఉండాలి. దానికి జీఎస్టీ కట్టాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో ఏ ఒక్క విక్రయ కేంద్రంలోనూ బిల్లులు విధిగా వేసిన దాఖలాలేవు. ఎటువటి నిర్ణత ధరలు లేకుండా అమ్ముతున్నా ఆ శాఖ అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాల్లేవు. ఎంఆర్‌పిపైనే జీఎస్టీని వసూలు చేయాల్సి ఉంటుంది. అసలు ఎంఆర్‌పిలే లేకుండా విక్రయాలు సాగుతున్నప్పుడు జీఎస్టీ ప్రస్తావనే లేకుండా సాగాయి.

అనుమతుల్లోనూ తేడాలు

టపాసుల విక్రయాలకు అనుమతులు తీసుకున్న వాటిల్లోనే ఒక్కో శాఖ వద్ద ఒక్కో రకమైన సంఖ్యలు కనిపించడం గమనార్హం. ఉదాహరణకు సత్యసాయి జిల్లా కదిరిలో చూసినప్పుడు పురపాలక సంఘం వద్ద తీసుకున్న అనుమతులు 29షాపులకున్నాయి. అదే అగ్నిమాపక శాఖ వద్ద తీసుకున్న అనుమతులు 30 ఉన్నాయి. క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే 35 షాపులున్నాయి. ఈ రకంగా అనుమతులు తీసుకున్న వాటికి ఏర్పాటు చేసిన వాటికి మధ్య భారీ తేడాలే ఉన్నాయి. అనుమతి తీసుకున్న వరకైనా నిబంధనల ప్రకారం ఏర్పాటు చేశారా అంటే అదీ లేదు. 10-15 అడుగుల విస్తీర్ణంలో ఒక్కో షాపు ఏర్పాటు చేస్తామని అనుమతి పొందారు. కాని పెట్టిన దుకాణాలు చూస్తే 20-30 అడుగులు కూడా ఉండటం గమనార్హం. ఇంత జరుగుతున్నా అదికారులు ఎటువంటి చర్యలూ తీసుకున్న దాఖలాల్లేవు. అధికారులు గిఫ్ట్ బాక్సులతో సైలెంట్ అయిపోయారన్న ఆరోపణలున్నాయి. ధరలపైనా ఏ మాత్రం నియంత్రణ లేకపోవడంతో సామాన్యుడు కొనాలంటేనే భయపడిపోయే పరిస్థితి నెలకొంది.

కదిరి పట్టణంలో ఏర్పాటు చేసిన టపాసుల విక్రయశాల

చిన్నారుల మధ్య ఎస్పీ దీపావళి సంబరాలు

దుస్తులు, టపాసులు అందజేత

చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ అన్బురాజన్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

అనంతపురం ఎన్టీఆర్ కాలనీలోని షికారీ పిల్లలను ఎస్పీ అన్బురాజన్ శనివారం నాడు తన ఛాంబర్‌కు పిలిపించి వారి మధ్య దీపావళి వేడుకలు జరుపుకున్నారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న 60 మంది పిల్లలను పిలిపించి వారితో మాట్లాడారు. వారందరికీ ఎస్పీ దుస్తులు, స్వీట్స్, టపాసుల బాక్సులను అందజేశారు. అభం శుభం తెలియని వయస్సులో దీపావళి అనగానే మరింత ఉత్తేజంతో ఉండే పిల్లల మధ్య సంబరాలు జరుపుకోవడం ఆనందంగా ఉందని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కర్ రెడ్డి, డీసీఆర్బీ సిఐ విశ్వనాథచౌదరి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

జిల్లా ప్రజలు, పోలీసు సిబ్బందికి ఎస్పీ అన్బురాజన్ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. దీపావళి చీకట్లను పారదోలి ప్రజల జీవితాల్లో మరిన్ని కాంతులు నింపాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా జరుపుకునే ఈ దీపావళి పర్వదినాన ఆనవాయితీగా వచ్చే బాణ సంచాను సరైన జాగ్రత్తలతో కాల్చాలని సూచించారు.

సత్యసాయి జయంతి వేడుకలకు

రాష్ట్రపతి, గవర్నర్ రాక

భద్రత ఏర్పాట్లపై ఎస్పీ సమీక్ష

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయిబాబా 98 జయంతి వేడుకలకు రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, గవర్నర్ అబ్దుల్ నజీర్‌లు రానున్నారు. ఈ నేపథ్యంలో వారి పర్యటన, భద్రత ఏర్పాట్లపై ఎస్పీ మాధవరెడ్డి పోలీసు, ఇతర శాఖల అధికారులు, ట్రస్టు సభ్యులతో శనివారం నాడు సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ చేతన్, ఆర్డీవో భాగ్యరేఖ, అదనపు ఎస్పీ విష్ణు, డీఎస్పీ వాసుదేవన్ ఏఆర్ డీఎస్పీ విజయ్ కుమార్ తదితరులతో కలిసి ప్రశాంతి నిలయం, పుట్టపర్తి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. జయంతి వేడుకలకు కట్టుదిట్టమైన పోలీస్ భద్రత ఏర్పాటు చేసేలా అన్ని శాఖల అధికారులతోనూ మాట్లాడారు. రాష్ట్రపతి, గవర్నర్ పర్యటన సందర్భంగా పుట్టపర్తి పట్టణంలో ఎక్కడెక్కడ బందోబస్తు చేయాలన్న వాటిపై ఆర్డీవో ఇతర శాఖల అధికారులతో చర్చించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని శ్రీ సత్యసాయిబాబా జయంతి వేడుకల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతం చేసేందుకు భద్రతా ఏర్పాట్లను పూర్తి స్థాయిలో ప్రణాళిక బద్ధంగా చేపట్టనున్నట్లు ఎస్పీ తెలిపారు. దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా భద్రత ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. ట్రాఫిక్ సమస్య రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన పోలీసు సిబ్బందికి తెలియజేశారు. వివిఐపిలు, విఐపిలు ఉండే గణేష్ గేట్ గోపురం, వెస్ట్‌గేట్, శాంతిభవన్, సాయి కుల్వంత్, భోజన సముదాయాల శిబిరాలు, ప్రశాంతి నిలయం పరిసర ప్రాంతాల్లో గట్టి బందోబస్తు చేపట్టాలన్నారు. ఈనెల 18 నుంచి 24 వరకు జరిగే శ్రీ సత్యసాయిబాబా జయంతి వేడుకలు ముగిసేంత వరకు జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బి సిఐ రవీంద్రారెడ్డి, పట్టణ సిఐ కొండారెడ్డి, ఆర్ఐ టైటాస్, ఎస్ఐ సురేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అధిక లోడుతో టిప్పర్లు

ఇబ్బందులు పడుతున్న జనం

ప్రజాశక్తి-పుట్లూరు

అధిక టన్నేజీతో వెళ్తున్న టిప్పర్

మండల కేంద్రం నుంచి రోజూ వందల టిప్పర్లు అధిక లోడుతో వెళ్తున్నాయి. తాడిపత్రి-అనంతపురం జాతీయ రహదారి విస్తరణ పనులకు మండల నుంచి టిప్పర్ల ద్వారా అధిక టన్నేజీతో మట్టిని తరలిస్తున్నారు. అధిక లోడుతోపాటు అత్యధిక వేగంతో టిప్పర్లు వెళ్తుండటంతో దుమ్మూధూళి అధికం అవుతోంది. దీనికితోడు రోడ్డుపై చిన్న చిన్న కంకర పడుతోంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, రైతులతోపాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు గుంతలమయం అవుతోంది. ఇక ఓవర్ టేక్ చేస్తూ ప్రమాదాలకు కూడా గురవుతున్నారు. ఇంత జరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు నెలనెల మామూళ్లు ముట్టుతుండటం కారణంగానే చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అధిక లోడుతో వెళ్తున్న టిప్పర్ల యజమానుపై చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

'ప్రజారక్షణ భేరి'ని జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో అసమానతలు లేని అభివృద్ధి జరగాలని ఆకాంక్షిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 15న విజయవాడలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు ప్రజలు హాజరై జయప్రదం చేయాలని సిపిఎం నగర 2వ కమిటీ కార్యదర్శి ఆర్‌వి.నాయుడు పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం సిపిఎం నగర న్యూ కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ నగర్‌లో ప్రచారం నిర్వహించి బహిరంగ సభ పోస్టర్ల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాలు మోపుతున్నాయన్నారు. కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేసే విధానాలను అనుసరిస్తున్నాయని తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాలు రాష్ట్రానికి రావాల్సిన కేటాయింపులు కోతలు విధిస్తోందన్నారు. సాధించుకోవాల్సిన వైసిపి ప్రభుత్వం మోదీకి మొకరిల్లుతు ప్రజా ప్రయోజనాలు తాకట్టు పెట్టేశారని విమర్శించారు. ప్రధాన ప్రతిపక్షాలు టిడిపి, జనసేన పార్టీలు కూడా మోదీ ప్రభుత్వానికి సాగిలపడుతున్నాయని విమర్శించారు. బహిరంగ సభను జయప్రదం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర న్యూ కమిటీ నాయకులు ముత్తుజా, ఏటిఎం.నాగరాజు, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 15న విజయవాడలో నిర్వహించనున్న ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక హంపిరెడ్డి భవనంలో ప్రజా రక్షణభేరి సభకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం ఆయన మాట్లాడుతూ అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా బస్సుజాతాలు నిర్వహించామన్నారు. ముఖ్యంగా వెనుకబడిన అనంతపురం జిల్లాకు ప్రత్యేక నిధులు కేటాయించడంతోపాటు పరిశ్రమలు స్థాపించి ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. విద్య, వైద్యం అందుబాటులో ఉంచాలన్నారు. రైతాంగాన్ని ఆదుకోవాలని, వ్యవసాయ కార్మికులకు సొంత గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కల్పించాలని, గ్రామాలు, పట్టణాలు, జిల్లాలను అభివృద్ధి పథంలో నడపాలని ప్రభుత్వానికి తెలియజేసేందుకు ఈనెల 15న విజయవాడలో బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సభకు సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు హాజరుకానున్నట్లు తెలిపారు. కావున మండలంలోని రైతులు, వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలు, చేతివృత్తిదారులు, చిన్న సన్నకారు రైతులు, మహిళలు, విద్యార్థులు,నిరుద్యోగులు భారీగా తరలివచ్చి బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు దాసరి శ్రీనివాసులు, మారుతిప్రసాద్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, సభ్యులు రామునాయక్, తిమ్మప్ప, వెంకీ, అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : ఈనెల 15న విజయవాడలో జరిగే ప్రజారక్షణ భేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఉరవకొండ మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఇందుకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసమానతలు లేని అభివృద్ధి కోసం రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో బస్సు జాతాలు నిర్వహించి ఈనెల 15న ముగింపు సందర్భంగా భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సూర్యనారాయణ, నరసింహులు, శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

8 నుంచి అంగన్‌వాడీల నిరవధిక సమ్మె

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమస్యలు పరిష్కరించకపోతే డిసెంబర్ 8వ తేదీ నుంచి అంగన్‌వాడీలు నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ హెచ్చరించారు. శనివారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మాతా, శిశుమరణాలు తగ్గించడానికి, పోషకాహారాన్ని అందించటానికి పిల్లల సమగ్ర అభివృద్ధి పథకం అమలు వంటి కార్యక్రమంలో అంగన్‌వాడీలు నిరంతరం పని చేస్తున్నారన్నారు. అయితే ఆయా పథకాలను మరింత బలోపేతం చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం నిధులను తగ్గించడంతోపాటు ప్రయివేటు సంస్థలకు అప్పగిస్తోందన్నారు. మరోవైపు రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం సైతం పోషకాహారం సరఫరా చేసే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా జాప్యం చేస్తోందన్నారు. అంతేగాకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు ఎక్కువ కాలం నిల్వ ఉంచిన పాల ప్యాకెట్లను సరఫరా చేస్తోందన్నారు. ఇకపోతే ధరలు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ వేతనాలు మాత్రం పెంచడం లేదన్నారు. సిఎం జగన్ ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే తెలంగాణ కంటే మెరుగని వేతనాలు అమలు చేస్తానని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. అంతేగాకుండా అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ, పదవీ విరమణ పథకాలను అమలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పినా రాష్ట్ర ప్రభుత్వం ఖాతరు చేయడం లేదన్నారు. ఇలాంటి తప్పనిసరి పరిస్థితుల్లో అంగన్‌వాడీ రంగంలో ఉన్న అన్ని యూనియన్లు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆయా సమస్యలు పరిష్కరించకపోతే వచ్చేనెల 8వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ సమ్మెకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శకుంతల, రమాదేవి, జమున, కాత్యాయని, అరుణ, జయ భారతి, గోవిందమ్మ, రేష్మ, ధనలక్ష్మి, పాతక్క, తిప్పేరమ్మ, విజయలక్ష్మి, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్

15న 'చలో విజయవాడ' : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పోస్టర్లను విడుదల చేస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 15న ఏపిటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలో విజయవాడ కార్యక్రమానికి ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని ఏపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు పిలుపునిచ్చారు. శనివారం ఉపాధ్యాయ భవన్‌లో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్ నిర్వహించిన జిల్లా శాఖ కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలు ఆర్థికపరంగా తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. శాంతియుత నిరసనలు తెలియజేసే స్వేచ్ఛను కూడా హరిస్తోందని, ఎక్కడికక్కడే నిర్బంధిస్తూ ఉద్యమాన్ని నీరుగారిస్తోందని విమర్శించారు. నాలుగున్నర సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి డిఏ కూడా చెల్లించలేదన్నారు. 149 నెలల డిఏ బకాయిలను వెంటనే చెల్లించాలని, 11వ పిఆర్‌సిలోని అనేక బకాయిలను చెల్లించకుండానే 12వ పిఆర్‌సి నియమిస్తూ ఉత్తర్వులకే పరిమితం చేశారని ఎద్దేవా చేశారు. సుమారు రూ.30 వేల కోట్లు పైబడి ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సి ఉందన్నారు. విద్యా రంగానికి నష్టం కలిగించేలా ఉన్న 117 జిఓను రద్దు చేసి గ్రామీణ విద్యాభివద్ధికి పాటు పడాలని కోరారు. ఇంటీరియర్ రిలీఫ్‌ను వెంటనే ప్రకటించాలన్నారు. 15న నిర్వహిస్తున్న చలో విజయవాడ కార్యక్రమానికి జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపిటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు డి.ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, గౌరవ సలహాదారు బి.వెంకటేషులు, జిల్లా ఉపాధ్యక్షులు డేనియల్, నాగరాజు, బొమ్మయ్య, రాష్ట్ర కౌన్సిలర్లు సర్దార్ వలి, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలపై దాడులు

అనంతపురం : దీపావళి పండుగ సందర్భంగా నగరంలో ఏర్పాటు చేసిన బాణాసంచా దుకాణాలపై లీగల్ మెట్రాలజీ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా బాణాసంచా ప్యాకేజీ వస్తువులపై తయారీదారుని పూర్తి చిరునామా, తయారైన నెల, సంవత్సరం, వినియోగదారుడు ఫిర్యాదు చేసేందుకు ఉండాల్సిన పేరు, చిరునామా, ఫోన్ నెంబర్, ఈ మెయిల్ ఐడి తదితర వివరాలు లేకపోవడంతో 11 కేసులు నమోదు చేసి ఐదు కేసులకు రూ.15వేలు జరిమానా విధించారు. ఈ దాడుల్లో లీగల్ మెట్రాలజీ ఇన్స్‌పెక్టర్ మహమ్మద్‌గౌస్, సిబ్బంది పి.విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ డిఎం

టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిఎం సురేష్‌కుమార్

రాయదుర్గం : స్థానిక ఆర్టీసీ డిపోలోని మేనేజర్ కార్యాలయంలో శనివారం డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఐదుగురు ప్రయాణికులు తమ సమస్యలతోపాటు సలహాలు, సూచనలను అందించినట్లు తెలిపారు. వారి సమస్యలను ఆర్టీసీ పరిధిలో ఉన్నంతలో పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. కాగా రాయదుర్గం నుంచి ఉరవకొండ రూట్‌లో నడిపే బస్సు సర్వీసులకు సిబ్బంది, ప్రయాణికుల సమక్షంలో లక్కీ డిప్ డ్రా తీసినట్లు తెలిపారు. ఈ లక్కీడిప్‌లో మొదటి బహుమతి కనేకల్‌కు చెందిన జె.మంజునాథ్, రెండవ బహుమతి హెచ్.సిద్ధప్ప, మూడో బహుమతి బి.సతీష్ పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్యారేజ్ ఇన్‌ఛార్జి జయచంద్రనాయక్, ట్రాఫిక్ ఇన్‌ఛార్జి వరప్రసాద్‌బాబు, అకౌంట్స్ అసిస్టెంట్ మేనేజర్ సురేంద్రబాబు, డిపో కార్గో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ నుంచి నిర్వహించనున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను జయప్రదం చేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్‌ఎం.ఉమా మోహన్‌రెడ్డి, నగర మేయర్ వసీం , ఉప మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్యతో కలిసి వారోత్సవాల పోస్టర్లను జేసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల సేవలు ప్రజలకు చేరువ చేయడానికి వారోత్సవాలు ఉపయోగపడతాయని తెలిపారు. 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ వివిధ కార్యక్రమాలతో పాఠకులను ఆకట్టుకునేలా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ వి.సుబ్బరత్నమ్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ ఎల్‌ఎం.మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి

జెఎన్‌టియులో అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-అనంతపురం

భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక జెఎన్‌టియులోని పరిపాలన భవనంలో శనివారం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్ మాట్లాడుతూ దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన అసలు పేరు 'మొహియుద్దీన్ అహ్మద్' కాగా 'అబుల్ కలాం' అనేది బిరుదు అన్నారు. ఆజాద్ అనేది కలం పేరు అన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతికి గుర్తుగా నవంబర్ 11న ఆజాద్ మైనార్టీస్ డేగా జరుపుకుంటామన్నారు. ఆయన అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సి.శశిధర్, బి.దుర్గాప్రసాద్, జి.వి.సుబ్బారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌వి.సత్యనారాయణ, ఎంఎల్ఎస్.దేవకుమార్, డి.విష్ణువర్ధన్, పిఆర్ఒ ఎం.రామశేఖర్‌రెడ్డి, సెక్యూరిటీ హెడ్ వెంకటేష్, జిఎన్‌పి.మనీష్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం క్రైం : దేశానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు మరువలేనివని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ కొనియాడారు. అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని శనివారం నగరంలోని జిల్లా పోలీసు కాన్ఫరెన్స్ హాల్ ఆవరణలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధులుగా, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖామంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు అందించారన్నారు. విద్యా శాఖ మంత్రిగా ఆయన ఎన్నో విద్యాలయాలు తీసుకొచ్చి దేశంలో విద్యా రంగం అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. ఆయన సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, జి.రామకృష్ణ, ఎ.హనుమంతు, ఏఆర్ డీఎస్పీ మునిరాజు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, పలువురు సివిల్, ఏఆర్ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాయదుర్గం : స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ మొదటి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమని విప్ కాపు రామచంద్రారెడ్డి కొనియాడారు. అబుల్ కలాం జయంతిని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని కొలిమి వీధిలో ఉన్న సచివాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం పురపాలక సంఘం ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, వార్డు సభ్యులు శ్రీనివాసరెడ్డి, గోవిందరాజులు, ఫక్రుద్దీన్, హౌసింగ్ డైరెక్టర్ శ్రీనివాసులు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎన్‌టి సిద్ధప్ప, పట్టణ కన్వీనర్ అరవ శివప్ప, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం జయంతిని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని ఏపీ రాష్ట్ర పెన్షనర్ల భవనంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం మండల అధ్యక్షులు కె.అబూబకర్, అదనపు కార్యదర్శి జన్నే కుళ్లాయిబాబు, కార్యదర్శి కె.రామ్మోహన్, నాయకులు వెంకటేష్, స్వామిదాస్, గోవిందు, శకుంతలమ్మ, మాబుసాబ్, హసన్ మహమ్మద్, ఆదినారాయణరెడ్డి, నాగేశం, కృష్ణవేణి, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం లైబ్రరీలో అబుల్ కలాం ఆజాద్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతపురం కలెక్టరేట్ : అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో చిత్రపటానికి గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్‌ఎం.ఉమామోహన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు ఎల్‌ఎం.మోహన్ రెడ్డి, ఉప గ్రంథాలయ అధికారి వి.సుబ్బరత్నమ్మ, శివశంకర్ ప్రసాద్, ఇంతియాజ్ అహమ్మద్, బాషా, కావేరి, ఉజ్జినేశ్వరి పాఠకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే టిడిపి ఆధ్వర్యంలో అనంతపురం అర్బన్ కార్యాలయంలో అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో రిటైర్డ్ ఎస్పీ షేక్షావలి, నాయకులు దేవళ్ల మురళి, జేయం బాషా, రఫీక్ అహమ్మద్, ఎస్‌ఎం.బాషా, లక్ష్మీ నరసింహులు, సుధాకర్ యాదవ్, గోపాల్ గౌడ్, ముత్యాలు, పరంధామ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

జిల్లాలో ఇద్దరిపై పీడీ యాక్టు

కడప సెంట్రల్ జైలుకు తరలింపు : ఎస్పీ

అనంతపురం క్రైం : జిల్లాలో తరుచూ నేరాలకు అలవాటు పడటం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఇద్దరిపై పీడీ యాక్టు ప్రయోగించినట్లు ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ గౌతమి ఉత్తర్వుల మేరకు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ జి.రామకృష్ణ, గుంతకల్లు డీఎస్పీ యు.నరసింగప్ప ఆధ్వర్యంలో కరుడుగట్టిన నేర చరిత్ర కలిగిన గుంతకల్లుకు చెందిన సుధాకర్, గుత్తి మండలం ఊబిచెర్లకు చెందిన నక్కా ఆంజనేయులుపై పీడీయాక్ట్ ప్రయోగించినట్లు తెలిపారు. వీరు ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించడం, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం, ప్రజా ఆహార భద్రత, శాంతి భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉండటంతో ఇద్దరినీ అరెస్టు చేసి కడప సెంట్రల్ జైలుకు తరలించినట్లు తెలిపారు. జిల్లాలో ఎవరైనా ఇలాంటి నేరాలకు పాల్పడేతే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

కర్నాటక మద్యం స్వాధీనం

మద్యం వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం : అనంతపురం సెబ్ అదనపు ఎస్పీ రామకృష్ణ ఆదేశాల మేరకు ఇన్స్‌పెక్టర్ రవిచంద్ర ఆధ్వర్యంలో దాడి చేసి భారీగా కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సెబ్ అధికారుల వివరాల మేరకు.. రాప్తాడు మండలం మరూరు టోల్‌ప్లాజా వద్ద అనుమానాస్పదంగా ఉన్న కారును తనిఖీ చేయగా 29 బాక్సుల్లో ఉన్న 2784 టెట్రా పాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బెంగళూరుకు చెందిన శ్రీనివాసచేతన్, రమేష్ కలిసి బెంగళూరులోని వైన్‌షాపుల్లో మద్యాన్ని కొనుగోలు చేసి గుంతకల్లు చుట్టు పక్కల ప్రాంతాల్లో అమ్మేందుకు తరలిస్తుండగా మరూరు వద్ద పట్టుబడ్డారు. ఈ దాడుల్లో అనంతపురం ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్లు జగదీశ్వర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, గురునాథ్‌రెడ్డి, సెబ్ ఇంటెలిజెన్స్ ఇన్స్‌పెక్టర్ నరసానాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ వైరు చోరీ

పుట్లూరు : మండల పరిధిలోని శనగలగూడూరు గ్రామంలో రంగనాథరెడ్డి తోట వద్ద రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లోని వైరును గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఉదయం గమణించిన రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా మండలంలో వరుసగా చోరీలు జరుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు చోరీలపై నిఘా ఉంచి నిందితులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి : పట్టణంలోని కోళ్లఫారం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని అనగానిదొడ్డి గ్రామానికి చెందిన గణేష్, వీరాంజనేయులు ద్విచక్ర వాహనంలో గుత్తికి వచ్చారు. కోళ్ల ఫారం వద్ద ఉన్న పెట్రోల్ బంకులో ద్విచక్ర వాహనానికి పెట్రోల్ వేసుకుని రోడ్డు క్రాస్ చేస్తుండగా కర్నూలు వైపు నుంచి వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డ గణేష్, వీరాంజిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా.. : టిడిపి

విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-బెలుగుప్ప

ఏ ప్రభుత్వంలో ఎక్కువ అభివృద్ధి జరిగిందో బహిరంగ చర్చకు తాము సిద్ధమని టిడిపి జిల్లా కార్యదర్శి మల్లికార్జున, కన్వీనర్ ప్రసాద్, వైస్ ఎంపిపి తిమ్మప్ప సవాల్ విసిరారు. శనివారం మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు తిరిగి జగన్‌ను ఎన్నుకునేందుకు సిద్ధంగా లేరన్నారు. ఎందుకంటే రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పూర్తిగా కుంటు పడిందన్నారు. ముఖ్యంగా నాలుగున్నరేళ్లుగా మండలంలో ఎలాంటి అభివృద్ధీ చేయలేదన్నారు. కేవలం సచివాలయాలు, ఆర్‌బికెలు తప్ప చేసింది శూన్యమన్నారు. తమక నాయకుడు, ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ కనబడడం లేదని చెబుతున్న వైసిపి నాయకులు కనపడుతున్న నాయకులు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఉరవకొండ ఎమ్మెల్యేగా నాలుగు సార్లు గెలుపొందిన ఏకైక వ్యక్తి పయ్యావుల అన్నారు. 2024లో కూడా అత్యధిక మెజార్టీతో పయ్యావుల కేశవ్‌ను గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాధాకృష్ణ, తిప్పయ్య, త్రివేదినాయుడు, ఆవులెన్న సర్పంచి రామ్మోహన్‌చౌదరి, వన్నూరుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పథకాలు చూసి జగన్‌కు ఓటేయాలి : విప్ కాపు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక సిఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి రానున్న ఎన్నికల్లో ఓటేయాలని విప్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని 3వ ఎన్నికల వార్డులో ఉన్న ఓబులాచారి రోడ్డు 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి' (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ, ప్రతి పౌరుడికీ ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధి చేకూరిందన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ తిరిగి అందాలంటే మళ్లీ జగన్‌ను సిఎంను చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, వలిబాషా, వార్డు సభ్యులు శ్రీనివాసరెడ్డి, గోవిందరాజులు, ఫక్రుద్దీన్ వైకాపా జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎన్‌టి.సిద్ధప్ప, రాయదుర్గం పట్టణ కన్వీనర్ ఆరవ శివప్ప, రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ శ్రీనివాసులు, వలిరావు, నిజాముద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

మహిళకు పథకాలను వివరిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

విద్యతోపాటు సాంస్కృతిక పోటీల్లో ప్రావీణ్యం సాధించాలి

ఉరవకొండ : గ్రామీణ ప్రాంత విద్యార్థులు విద్యతోపాటు సాంస్కృతిక పోటీల్లోనూ ప్రావీణ్యం సాధించాలని ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఊరగాద్రి బాలోత్సవం-2023 కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా దాదాపు 300 మంది విద్యార్థులకు గానం, నృత్యం, నాటిక, మెమరీ టెస్ట్ వంటి పోటీలు నిర్వహించారు. పోటీల్లో 36 మందిని విజేతలుగా ప్రకటించి అభినందించారు. విజేతలకు నవంబర్ 14 పిల్లల దినోత్సవం సందర్భంగా బహుమతులతో పాటు షీల్డ్‌లు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి సురేంద్ర, గీత ప్రచార సమితి వ్యవస్థాపకులు దివాకర్, నిస్వార్థ ఫౌండేషన్ అధ్యక్షులు తాటికొండ వెంకట్, సభ్యులు నిర్మల, శైలజ, జ్యోతి, మంజూ శ్రీదేవి, రజినీ, భాగ్య, మహేశ్వరి, చాందినీ, స్వాతి, చంద్రశేఖర్, ఓబులేసు, శ్రీనివాసులు, వేణుగోపాల్, నూర్, చిరంజీవి, రామకృష్ణ, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

టపాసుల దుకాణాల పరిశీలన

నార్పల : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలల పాఠశాల క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన లైసెన్స్ టపాసుల దుకాణాలను ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ టపాసుల దుకాణదారులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలను పాటించాలన్నారు. ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా ప్రతి దుకాణం వద్ద ఇసుక, నీరు, మంటల్ని ఆర్పడానికి హైడ్రోజన్ తదితర ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఈశ్వరయ్య, కానిస్టేబుల్ జాఫర్ వలి, హరికుమార్, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహం ప్రతిష్టాపనకు విరాళం

రాయదుర్గం రూరల్ : మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపనకు రాయదుర్గం నియోజకవర్గ వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు బండి క్రిష్టప్ప రూ.10100 శనివారం విరాళంగా అందజేశారు. కడప జిల్లా సింహాద్రిపురం మండలం హేమకుంట్ల గ్రామంలో ఏర్పాటు చేయనున్న వాల్మీకి విగ్రహం ప్రతిష్టాపన కోసం ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో సతీమణి సరస్వతి, కుటుంబ సభ్యులు భారతి, హరీష్ కుమార్, సేవాసమితి కార్యదర్శి ఎన్.టి.సిద్ధప్ప, ఉపాధ్యక్షుడు మలకన్న, కోశాధికారి బండి చంద్రశేఖర్, ఉప కోశాధికారి రఘు, ప్రకాష్, సత్తి, సిద్ధలింగప్ప, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ ద్రోహి చంద్రబాబు

అనంతపురం కలెక్టరేట్ : రాయలసీమకు అడుగడునా అన్యాయం చేసి ద్రోహిగా టిడిపి అధినేత చంద్రబాబు నిలిచారని వైసిపి ఐటి వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని వైసిపి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ రాయలసీమకు అన్యాయం చేసిన చంద్రబాబుకు ఓటు ఎందుకు వేయాలో ఆ పార్టీ నాయకులు సమాధానం చెప్పాలన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై తీవ్రంగా నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. హంద్రీనీవా కాలువ వెడల్పు చేసి చెరువులకు నీరు ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేస్తుంటే కోర్టులకు వెళ్లి అడ్డుకుని నీచ రాజకీయాలకు చంద్రబాబు వడికట్టారని విమర్శించారు. ప్రజలు చైతన్య వంతులయ్యారని చంద్రబాబుకు గుణపాఠం ఇది వరకే నేర్పారని, మరోసారి గుణపాఠం తప్పదని తెలిపారు.

సినీనటుడు చంద్రమోహన్‌కు సంతాపం

అనంతపురం కలెక్టరేట్ : సినీనటుడు చంద్రమోహన్ మృతిపై పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి ఆధ్వర్యంలో సంతాప వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా శనివారం టవర్‌క్లాక్ సర్కిల్‌లో చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సురేష్, శ్రీరాములు, కళాభారతి నాయకులు ఆదినారాయణ, విఎంపి.నాయుడు, శేషాద్రి, శ్రీనివాసులు, వలి, మునిరత్నం పాల్గొన్నారు.

పలువురు వైసిపిలో చేరిక

పార్టీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే అనంత

అనంతపురం : అనంతపురంలో జరుగుతున్న అభివృద్ధి, సిఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్శితులై నగరంలోని 12వ డివిజన్‌కు చెందిన పలువురు యువకులు గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ తనయుడు సుల్తాన్ ఆదాం ఆధ్వర్యంలో శనివారం వైసిపిలో చేరారు. ఈసందర్భంగా వారికి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనరంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సిఎం జగన్ సహకారంతో అనంతపురం ఎంతో అభివృద్ధి చెందుతోందన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ సిఎం జగన్ ప్రజల మదిలో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ముఖ్యంగా అనంతపురంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో అందరం కలిసికట్టుగా పని చేసి మరోమారు జగన్‌ను సిఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో గౌస్‌పీర్, జోహార్, అబిద్, సిరాజ్, మౌలానా, ఆఫ్రిద్, జాఫర్‌తోపాటు పలువురు యువకులు చేరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ ఓబిరెడ్డి, మండల కన్వీనర్ హుస్సేన్, కార్పొరేటర్ సంపంగి రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలి

ఉరవకొండ : రెండవ శనివారం అయినప్పటికీ తరగతులు నిర్వహించిన పట్టణంలోని వివేకానంద, మహేశ్వరి ప్రయివేట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు హారన్‌రషీద్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలల వద్దకు వెళ్లి తరగతులను బంద్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెలవు రోజు అయినప్పటికీ ఉదయం 8వ తరగతి నుంచి తరగతులు నిర్వహిస్తుండటంతో తెలుసుకుని అడ్డుకున్నామన్నారు. వెంటనే విద్యాశాఖ అధికారులు ఆయా పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు సుధీర్, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను అరికడదాం

ఉరవకొండ : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాకెట్ల ప్రభుత్వ వైద్యాధికారి పావని సూచించారు. మండల పరిధిలోని ఆమిద్యాల గ్రామంలో సర్పంచి శ్రీరాములు ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికీ వెళ్లి రోగుల నివారణకు తీసుకోవాల్సిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని, వేపాకు పొగ వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి, పంచాయతీ సెక్రటరీ బాషా, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

అనంతపురం : దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని రుద్రంపేట సర్పంచి సుగాలి పద్మావతి, పంచాయతీ కార్యదర్శి హిదయాతుల్లా తెలిపారు. శనివారం రుద్రంపేట పంచాయతీలో దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఆదినారాయణనాయక్, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి అందజేత

క్రీడా సామగ్రిని అందజేస్తున్న దాతలు

రాయదుర్గం రూరల్ : స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అనంతపురానికి చెందిన జి.టెక్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ అధినేతలు నవచేతన్, జగదీశ్వర్‌రెడ్డి సుమారు రూ.75 వేలు విలువజేసే క్రీడా సామగ్రి, రూ.25 వేలు విలువజేసే కలర్ ప్రింటర్స్‌ను శనివారం అందజేశారు. రూ.లక్ష విలువజేసే సామగ్రిని కళాశాలకు ఇచ్చినందుకు ప్రిన్సిపల్ రఘురామమూర్తి, కళాశాల అధ్యాపకులు జి.టెక్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు.

సమగ్రాభివృద్ధిపై చర్చేది?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

దేశంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతం ఉమ్మడి అనంతపురం జిల్లా. అత్యల్ప వర్షపాతం నమోదయ్యే ప్రాంతం కూడా ఇదే. ఇటువంటి ప్రాంతంలో సమగ్రాభివృద్ధికి ఉన్న అవకాశాలపై అనేక ఏళ్లుగా చర్చ నడుస్తూనే ఉంది. సాగునీటి వసతి కల్పించడం... ఉపాధి అవకాశాలు మెరుగుపరచడంపై దృష్టి సారించాలని వామపక్షాలతోపాటు అనేక ప్రజాసంఘాలు ఎప్పుడూ తమ డిమాండ్‌ను ప్రభుత్వాల ముందుంచుతున్నాయి. ఇప్పుడు కూడా ఇదే అంశాన్ని సిపిఎం ముందుకు తీసుకొస్తోంది. ఇందులో భాగంగానే జిల్లా సమగ్రాభివృద్ధిని కాంక్షిస్తూ రాష్ట్ర జాతా ముగిసిన తర్వాత జిల్లాలోనూ స్కూటర్ యాత్ర చేపట్టింది. జిల్లాలోని వనరులతోపాటు, అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న సూచనలు చేయడమే కాకుండా, దీనిపై ప్రచారాన్ని నిర్వహిస్తోంది. అత్యల్ప సాగునీటి వసతి ఉన్న ఈ ప్రాంతంలో హంద్రీనీవా ఆధునీకరణతోపాటు, తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ చేపట్టాలని కోరుతోంది. అదేవిధంగా చెరువుల అనుసంధానం చేయాలని, ఉద్యానవన పంటలకు తగినంత ప్రోత్సాహకాలను అందివ్వాలని ఇలా అనేక డిమాండ్లను ప్రభుత్వాల ముందు సిపిఎం ఉంచింది. ఇక విలువైన ఖనిజ సంపదకు నిలయమైన ఈ కరువు నేలలో ఇనుప ఖనిజం, బంగారు ఖనిజం, వజ్ర నిక్షేపాల నిలయంగానూ ఉంది. ఇవి కాకుండా నాపరాయి, గ్రానైట్ వంటి ఖనిజ వనరులు పుష్కలంగానున్నాయి. వీటి ఆధారంగా పరిశ్రమలను స్థానికంగా నెలకొల్పాలన్న డిమాండ్ ఉంది. సత్యసాయి జిల్లాలో చిలమత్తూరు ప్రాంతంలో ఐటి అభివృద్ధికి అవకాశాలున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రపకటించిన అనేక హామీలు పెండింగులోనున్నాయి. వీటిని చేపట్టాలని సిపిఎం యాత్రను చేపట్టింది. అంతక మునుపు చర్చావేదిక సైతం నిర్వహించింది. అన్ని వామపక్ష పార్టీలు కూడా దీనికి మద్దతు ఇచ్చాయి. ఇది ఇలాగుంటే ఇంతటి ముఖ్యమైన అంశంపై మాత్రం ప్రధాన రాజకీయ పార్టీలైన వైసిపి, టిడిపి పెదవి విప్పడం లేదు. ఇకపోతే సిఎం జగన్ ఈవారంలో పుట్టపర్తికి విచ్చేసిన సమయంలోనూ జిల్లా అభివృద్ధికి సంబంధించిన అంశాలుగానీ, కరువును ఎదుర్కొనే అంశాన్నిగానీ కనీస ప్రస్థావన చేయకపోవడం గమనార్హం. రెండు పార్టీలు విమర్శలు, ప్రతి విమర్శలు మినహా ఈ ప్రాంతాభివృద్ధికి చేపట్టాల్సిన విషయాల గురించి మాట్లాడలేదు. ఈ ఏడాది తీవ్రమైన దుర్భిక్ష పరిస్థితుల నేపథ్యంలో ఇప్పటికే జిల్లాల నుంచి వలసలు సైతం మొదలయ్యాయి. ఖరీఫ్, రబీ రెండు సీజన్లలోనూ వర్షాభావంతో పంటలు ఏ మాత్రం పండలేదు. ఉపాధి అవకాశాల్లేక అనేక మంది గ్రామాలను వదిలి కర్నాటక, కేరళ రాష్ట్రాలకు ఉపాధి కోసం వలసలు పోతున్నారు. వాటి నివారణ కోసం ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నా పనులు ప్రారంభించిన దాఖలాల్లేవు. కేంద్రం కూడా నిధులు కేటాయించామని చెప్పే ప్రయత్నం చేస్తోంది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు ఇటీవల జిల్లాలో పర్యటించి కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని పరిశీలించి నిధులు కేటాయించామని ప్రచారం చేస్తున్నారు. విభజన హామీల్లో వెనుకబడిన ప్రాంతాల ఇస్తామన్న నిధులు మూడు సంవత్సరాలు ఇచ్చి నిలిపివేశారు. దీనిపై బిజెపి నాయకులు ప్రస్తావించడం లేదు. నిధులు రాబట్టే ప్రయత్నం చేస్తామన్న ప్రకటనా లేదు. ఇక బెల్, నాసన్ పనులు నత్తనడకనే నడుస్తున్నాయి. నాసన్‌లో ఒక భవనాన్ని పూర్తి చేసి వచ్చే నెలలో ప్రారంభిస్తామని చెబుతున్నారు. తక్కిన హామీల సంగతుల గురించి పట్టించుకోవడం లేదన్న విమర్శలూ ఉన్నాయి.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

అజయ్ పాటిల్

అజయ్‌ను సన్మానిస్తున్న భావన పాఠశాల నిర్వాహకులు రాజగోపాల్ దంపతులు

ప్రజాశక్తి-రాయదుర్గంరూరల్

తన పుట్టిన రోజు సందర్భంగా యువత సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని అజయ్ పాటిల్ అన్నారు. తన జన్మదిన వేడుకలను అజయ్ పాటిల్ అభిమానుల మధ్య శనివారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా పల్లేపల్లి నుంచి భారీ వాహన శ్రేణితో పట్టణంలోని శాంతినగర్‌కు చేరుకుని అక్కడి నుంచి ఊరేగింపుగా వినాయక సర్కిల్ మీదుగా లక్ష్మీ బజార్‌లోని కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయం వద్ద కేక్ కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా యువకులు పెద్ద సంఖ్యలో రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తన జన్మదినం సందర్భంగా యువకులు రక్తదానం చేయడం ఆదర్శనీయమన్నారు. ఆపదలో ఉన్నవారికి కావాల్సిన రక్తం ఇవ్వగలిగితే అంతకంటే మించిన సార్థకతో ఉండదన్నారు. నలుగురికి మంచి చేయాలని సంకల్పంతో రక్తదానం లాంటి మంచి కార్యక్రమాలు చేయడం సంతోషకరమన్నారు. స్ఫూర్తినిచ్చే ఇలాంటి మంచి కార్యక్రమాలు చేసేందుకు యువకులు ముందుకు రావడం తృప్తినిచ్చిందన్నారు. అనంతరం పలు గ్రామాల నుంచి జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చినవారు పూలమాలలు వేసి అజయ్‌కు శాలువాలు కప్పి సత్కరించారు. తర్వాత ప్యాలెస్ రోడ్డులోని భావన స్కూల్ ఆవరణలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మల్లాపురం నరేష్ రెడ్డి, షమీవుల్లా, వీరేష్ స్వామి, కదరంపల్లి సలీం, దాదు, మంజు, వంశీ, షామీర్, సాయి, ఓంకార్, శరత్, శేఖర్, వీరేష్, నరసింహ, శ్రీకాంత్, నాగరాజు, అశోక్, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలను అభినందిస్తున్న అజయ్ పాటిల్

భావన స్కూల్ నిర్వాహకుల ఆధ్వర్యంలో..

పట్టణంలోని కెబి ప్యాలెస్ రోడ్డులో అజయ్ పాటిల్ నూతన భవనాన్ని నిర్మించి భావన స్కూలుకు అద్దెకిచ్చారు. దీంతో భావన స్కూల్ కరస్పాండెంట్ పి. రాజగోపాల్, పి. ఇందిరాదేవి ఆధ్వర్యంలో అజయ్‌పాటిల్ జన్మదిన వేడుకలను విద్యార్థుల నడుమ ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అజయ్ దంపతులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ పురుషోత్తంరెడ్డి, కామూర్తి బాబు, మల్లాపురం నరేష్ రెడ్డి, భావన స్కూల్ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.